


సత్వర న్యాయానికి 'జగనన్నకు చెబుదాం'

సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వద్దు :కలెక్టర్

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

'జగనన్నకు చెబుదాం" అనే కార్యక్రమం దేశంలోనే ఎక్కడ లేని విధంగా వినూత్నమైన కార్యక్రమమని, ఫిర్యాదుల పరిష్కార హెల్ప్‌లైన్- 1902. ఈ టోల్- ఫ్రీ నంబర్ తో ప్రస్తుతం జరుగుతున్న స్పందన గ్రీవెన్స్ కు మరింత మెరుగులు దిద్ది ప్రజల సమస్యలకు నాణ్యమైన, సత్వర పరిష్కారం కొరకేనని కలెక్టర్ కె. వెంకట రమణా రెడ్డి అన్నారు. బుధవారం ఉదయం స్థానిక కలెక్టరేట్ లో వర్చువల్ విధానంలో మండల స్థాయి డివిజన్ స్థాయి అధికారులతో జగనన్నకు చెబుదాం కార్యక్రమంపై జిల్లా కలెక్టర్ దిశానిర్దేశం చేసి ఆనంతరం మీడియాతో మాట్లాడారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని మంగళవారం ముఖ్యమంత్రి తాడేపల్లి సి.ఎం క్యాంపు కార్యాలయం నుండి ప్రారంభించారన్నారు. వివక్షలేని, అవినీతికి తావు లేకుండా, అర్హులైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందించే దిశలో ప్రభుత్వం పని చేస్తోందని ముఖ్యమంత్రి స్థాయి నుండి గ్రామ సచివాలయం ఉద్యోగి వరకు ప్రజా సేవకులమని, ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించే దిశలో అర్జీదారుల సమస్యను స్పందన, 1902 హెల్ప్ లైన్ ద్వారా అందిన వెంటనే సంబంధిత అధికారికి సదరు అర్జీ పంపబడుతుందని, దానిని సదరు అధికారి ఓపెన్ చేసి అర్జీదారుని సంప్రదించి వారి సమస్యపై పరిష్కరించే విధంగా సకాలంలో పరిష్కరించి, అర్జీదారునితో ఫోటో దిగి, చర్యలు చేపడుతున్నపుడు ఫోటో మరొకసారి, సమస్య పరిష్కారం అయిన తర్వాత మరొకసారి ఆన్లైన్లో అప్లోడ్ చేయాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈ ఫిర్యాదులను రాష్ట్ర స్థాయి ప్రభుత్వ విభాగాల కార్యదర్శులు , విభాగాల అధిపతులు, జిల్లా స్థాయి, డివిజన్ స్థాయి, మండల స్థాయి వరకు ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్ల ఏర్పాటుతో (పిఎంయు) ముఖ్యమంత్రి కార్యాలయం నుండి నేరుగా నిరంతర పర్యవేక్షణ చేస్తూ, సకాలంలో ఫిర్యాదులపై పరిష్కారం నాణ్యతగా అందేలా చర్యలు చేపడతారని తెలిపారు. ఆడిట్ టీమ్ లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తాయని అన్నారు. ప్రజల ప్రతిస్పందన కూడా తీసుకొని విశ్లేషణ చేసి ప్రజలకు



మరింత మెరుగైన సేవలు అందించేలా చర్యలు ఉంటాయని అన్నారు. 1902 కు ఫిర్యాదు అందిన వెంటనే సంబంధిత ఫిర్యాదుదారు మొబైల్ కు ఒక యువర్ సర్వీస్ రిక్వెస్ట్ ఐడీ పంపడం జరుగుతుందని, దీనిపై అన్ని స్థాయిలలో ట్రాకింగ్ (పర్యవేక్షణ) చేస్తూ నాణ్యమైన పరిష్కారం చూపేలా అధికారులు పనిచేయాలని అన్నారు. వాలంటీర్లు వారి పరిధిలోని ప్రతి యాభై గహాల సందర్శన చేసి ప్రజలకు జగనన్నకు చెబుదాం 1902 హెల్ప్ లైన్ నంబర్ పై అవగాహన కల్పించాలని అన్నారు. జిల్లాకు ప్రత్యేక అధికారిగా కేటాయించబడిన సీనియర్ ఐఎయస్ అధికారి శ్యామలా రావు నెలలో రెండు సార్లు ప్రతి 15 రోజులకు ఒకసారి జిల్లాలో పర్యటించి రాష్ట్ర ప్రాధాన్యత పథకాలు, సంక్షేమ కార్యక్రమాలతో పాటు ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్లతో కలిసి క్షేత్ర స్థాయిలో పర్యవేక్షిస్తారని తెలిపారు. జిల్లా ఎస్.పి. పరమేశ్వర రెడ్డి మాట్లాడుతూ స్పందన కార్యక్రమం ప్రతి పోలిస్ స్టేషన్ , జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్నామని ఇంతవరకు కోర్టు కేసులు , రెవెన్యు తగాదాలు వంటివి ఆయా శాఖల కు పంపించడం జరిగేదని , జగనన్నకు చెబుదాం 1902 లో అందిన ఫిర్యాదులను ఇతర శాఖల సమన్వయంతో అర్జీదారుని సమస్య నిర్ణీత సమయంలో పరిష్కరించనున్నామని అన్నారు. సామాన్య ప్రజలకు సత్వర న్యాయం కొరకే జగనన్నకు చెబుదాం 1902 అని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ శ్రీనివాసరావు, ఆర్డీఓ లు కిరణ్ కుమార్, రామారావు, జిల్లా అధికారులు జిల్లా విద్యాధికారి శేఖర్, డి ఎం హెచ్ ఓ శ్రీహరి, డి సి హెచ్ ఎస్ ప్రభావతి, పి డి ద్వామా శ్రీనివాస రావు, డి ఎల్ డి వో సుశీల దేవి, ఆదిశేషరెడ్డి తదితరులు పాల్గొన్నారు

టిటిడికి ఎందుకీ వివక్ష : సిఐటియు

ప్రజాశక్తి-తిరుపతి టౌన్

టిటిడిలో పనిచేస్తున్న ఎఫ్ఎంఎస్, సులభ్, కాంట్రాక్టు కార్మికుల పట్ల యాజమాన్యం బుద్ధిపూర్వకంగానే వివక్షకు పాల్పడుతోందని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కందారపు మురళి ఒక ప్రకటనలో ఆరోపించారు. గత ఏడాది నిర్వహించిన శ్రీవారి బ్రహ్మోత్సవాలలో పాలుపంచుకున్న కార్మికులకు బ్రహ్మోత్సవ బహుమానం ఇవ్వాలని టీటీడీ బోర్డు తీర్మానం చేసిందని, ఈ ప్రతిపాదనను ఆమోదిస్తూ, జీవో ఆర్టీ నెంబర్ 34 (రెవెన్యూ ఎండోమెంట్స్) డిపార్ట్మెంట్ పేరుతో ప్రభుత్వం జీవోను విడుదల చేసిందని, ఆ జీవో ఆధారంగా టీటీడీలోని విభాగాధిపతులు, డ్రాయింగ్ ఆఫీసర్స్ తగిన చర్యలు తీసుకోవాలని, ఈఓ నోట్ ఆర్డర్స్ విడుదల చేశారని ఆ ప్రకటనలో పేర్కొన్నారు. జీవో విడుదలై ఐదు నెలలు కావస్తున్నా, నేటికీ కార్మికులకు బ్రహ్మోత్సవ బహుమానం అందివ్వక పోవటం వెనుక ఆంతర్యం ఏమిటని ఆయన ప్రశ్నించారు. శాశ్వత

కాంట్రాక్టు కార్మికులకు అందని బ్రహ్మోత్సవ బహుమానం

ఉద్యోగులకు, టైం స్కేలు, డిప్యుటేషన్ వారితో సహా రూ.14 వేల రూపాయలు జనవరి లోనే చెల్లించారని తెలిపారు. కాంట్రాక్టు, ఔట్సోర్సింగ్, ఎఫ్ఎంఎస్, కాల్ సెంటర్ లో పనిచేసే కార్మికులకు రూ. 6850ల చొప్పున బ్రహ్మోత్సవ బహుమానం ఇవ్వాల్సి ఉండగా ఇంతవరకు చెల్లించకపోవడం వివక్ష కాదా? అని ఆయన తీవ్రంగా ధ్వజమెత్తారు. శాశ్వత ఉద్యోగులకు జనవరిలోనే బ్రహ్మోత్సవ బహుమానం చెల్లించి, కాంట్రాక్ట్ కార్మికులకు, మలమూత్రాలను శుద్ధి చేసే సులబ్ కార్మికులకు బ్రహ్మోత్సవ బహుమానం ఎందుకు ఇవ్వలేదో... టీటీడీ సమాధానం చెప్పాలని మురళి డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆదేశాలు సైతం టీటీడీలో అమలు కాలేదంటే అర్థం ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ ఆదేశాలను సైతం అమలు చేయని ఉద్దండులు టీటీడీలో ఉండడంపై ఆయన మండిపడ్డారు. తక్షణం కార్మికులకు బ్రహ్మోత్సవ బహుమానం చెల్లించాలని డిమాండ్ చేశారు.

భద్రతా వైఫల్యాలపై చర్యలు తీసుకోండి : అఖిలపక్షం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

ప్రపంచ ప్రఖ్యాత ఆధ్యాత్మిక కేంద్రం తిరుమలలో ఇటీవల చోటు చేసుకుంటున్న భద్రతా వైఫల్యాలపై చర్యలు తీసుకోవాలని అఖిలపక్ష నాయకులు డిమాండు చేశారు. స్థానిక టిటిడి పరిపాలన భవనం వద్ద జరిగిన నిరసన కార్యక్రమాన్ని ఉద్దేశించి అఖిలపక్షం నాయకులు మాట్లాడుతూ తిరుమలలో ఇటీవల చోటు చేసుకుంటున్న భద్రతా వైఫల్యాలు ఆందోళన కల్గిస్తున్నాయన్నారు. గతంలో డ్రోన్‌ల ద్వారా యథేచ్ఛగా వీడియోలను చిత్రీకరించారని, అప్పట్లో ఆ ఘటన చాలా వివాదాస్పదం అయ్యిందన్నారు. అలాగే మహారాష్ట్ర భక్తులు వచ్చిన వాహనానికి చత్రపతి శివాజీ ఫొటో ఉందన్న సాకుతో వాహనాలను తిరుమలకు అనుమతించలేదన్నారు. దీంతో మహారాష్ట్రలో బాయ్‌కాట్ తిరుమల అంటూ ఆందోళనలు జరిగాయని గుర్తు చేశారు. ఈ విషయాన్ని గుర్తించిన టిటిడి పొరబాటును గ్రహించి



దిద్దుబాటు చర్యలు చేపట్టింది. శివాజీ మహారాజ్ ఫొటోలనే అనుమతించని విజిలెన్స్ అధికారులు అధికార పార్టీ స్టిక్కర్లను తిరుమలలోని ఇళ్లకు అతికిస్తుంటే చూస్తూ ఎలా ఉన్నారన్నారు. అలిపిరిలోనే పార్టీల ప్రచార సామాగ్రి, ఫోటోలను స్వాధీనం చేసుకునే విజిలెన్స్ సిబ్బంది, అధికార పార్టీ ప్రచార సామాగ్రిని తిరుమలకు ఎలా అనుమతించిందో ఆ దేవుడికే తెలియాలన్నారు. ఇదిలా ఉంటే తాజాగా ఓ అజ్ఞాత భక్తుడు తరుమల ఆలయం లోపల ఆనంద నిలయాన్ని చిత్రీకరించి, సామాజిక మాధ్యమాల్లో ప్రచారం చేశారని, ఇది పూర్తిగా భద్రతా వైఫల్యమేనన్నారు. అడుగడుగునా తనిఖీలు చేసే విజిలెన్స్ సిబ్బంది సెల్‌ఫోన్‌ను ఆలయం లోనికి తీసుకెళ్లుతుంటే ఏం చేస్తున్నారని ప్రశ్నించారు విఐపిలే సెల్‌ఫోన్‌ను తీసుకుని వెళ్లి ఉండవచ్చనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయన్నారు. ఈ భద్రతా వైఫల్యాలపై ఆందోళన చెందిన శ్రీవారి భక్తులుగా, స్థానిక రాజకీయ పార్టీల నాయకులుగా అఖిలపక్షం ఆధ్వర్యంలో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని డిమాండు చేశారు. బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన జిల్లా అధ్యక్షులు డాక్టరు పసుపులేటి హరిప్రసాద్, కిరణ్‌రాయల్, రాజారెడ్డి, ఆకేపాటి సుభాషిణి, కీర్తన, టిడిపి నాయకులు, మాజీ ఎంఎల్ఏ సుగుణమ్మ, నరసింహయాదవ్, ఆర్‌సి మునికృష్ణ, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

18 వరకు మీడియా అక్రిడేషన్ దరఖాస్తులు స్వీకరణ

ప్రజాశక్తి-తిరుపతిటౌన్

జిల్లాలో 2023, 2024 రెండు సంవత్సరాల మీడియా అక్రిడేషన్ల కొరకు ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకొనుటకు ఈ నెల 18 వరకు అవకాశం కల్పించామని కలెక్టర్, జిల్లా అక్రిడేషన్ కమిటీ చైర్మన్ కె.వెంకటరమణా రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం జర్నలిస్ట్ లకు అక్రిడేషన్ల మంజూరు నిమిత్తం ప్రభుత్వ ఉత్తర్వులు 38 జనరల్ అడ్మినిస్ట్రేషన్ (ఐ అండ్ పి ఆర్) డిపార్ట్మెంట్ తేది. 30.03.2023 జారీ మేరకు ఆన్ లైన్ లో దరఖాస్తు నిమిత్తం డబ్ల్యుడబ్ల్యు డబ్ల్యు డాట్ ఐపిఆర్‌డాట్ ఎంపి డాట్ జీవోవిడాట్ ఇన్ వెబ్ సైట్ అందుబాటులో వుందని , సదరు జి.ఓ. మేరకు జర్నలిస్టులు తమ వివరాలతో పాటు యాజమాన్యాల సిఫారసు లేఖ, అవసరమైన డాక్యుమెంట్లు పిడిఎఫ్ ఫార్మాట్ లో అలాగే పాస్ పోర్ట్ సైజ్ ఫోటో , దరఖాస్తుదారు సంతకం ఫోటో ఫార్మాట్ లో ఆన్ లైన్ లో అప్ లోడ్ చేయాలని, అనతరం అప్ లోడ్ చేసిన డాక్యుమెంట్లు , డౌన్ లోడ్ చేసిన అప్లికేషన్ , 2 పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు జిల్లా సమాచార పౌరసంబంధాల అధికారి కార్యాలయం, తిరుపతి నందు ఈ నెల తేదీ18 లోపు అందజేయాలని కలెక్టర్ ఆ ప్రకటన లో తెలియజేసారు.

శ్రీసిటీ సలహాదారుగా జపాన్ మాజీ రాయబారి

ప్రజాశక్తి- వరదయ్యపాలెం

శ్రీసిటీ సలహా దారుగా జమైకాలోని జపాన్ మాజీ రాయబారి మసనోరి న క న నియమితులయ్యారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి, మసనోరి నకనో ఇటీవల జపాన్ లో ఈ నియామక



ఒప్పందంపై సంతకం చేశారు. ఒప్పందం అనంతరం మసనోరి నకనో స్పందిస్తూ, 2011లో మొదటిసారి శ్రీసిటీని సందర్శించినప్పుడు, అక్కడ అద్భుతమైన వ్యాపార సామర్థ్యం తనను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. శ్రీసిటీ బందంలో చేరడం గౌరవంగా భావిస్తున్నానన్నారు. నకానో శ్రీసిటీలో భాగమైనందున, మరిన్ని జపనీస్ సంస్థలు ఇక్కడకు తరలివస్తాయన్న ఆశాభావాన్ని ఆయన వ్యక్తం చేశారు.



శ్రీవారిని దర్శించుకున్న తెలంగాణ రాష్ట్ర గవర్నర్

తిరుమల : శ్రీవారిని తెలంగాణ రాష్ట్ర గవర్నర్, పుదుచ్చేరి లెఫ్టినెంట్ గవర్నర్ తమిలిసై సౌందర రాజన్ దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకున్న అనంతరం గవర్నర్ రంగనాయక మండపంలో ఆలయ అర్చకులు వేద మంత్రాలతో ఆశీర్వ చనం పలుకగా , టీటీడీ ఈఓ ఏవి ధర్మారెడ్డి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

ఆవుకి అరుదైన శస్త్రచికిత్స విజయవంతం : డాక్టర్ ఎం. రఘునాథ్

ప్రజాశక్తి - క్యాంపస్

శరీరంలోని కాలు అవయవం నొప్పితో బాధపడుతూ నిలబడలేకపోతున్న ఆవుకు అరుదైన శస్త్రచికిత్స విజయవంతం అయ్యిందని శ్రీ వేంకటేశ్వర పశువైద్య విశ్వవిద్యాలయ ఆచార్యులు డాక్టర్ ఎం. రఘునాథ్ అన్నారు. కలకడ మండలానికి చెందిన మూడున్నరేళ్ల వయసున్న ఆవు రెండు రోజుల క్రితం దూడను పుట్టించింది. గాయం కారణంగా జంతువు డెక్కకు బదులుగా నేలపై దాని హాక్ జాయింట్‌ను తాకింది. ఈ కారణంగా ఇతర అవయవం కూడా కిందికి పడిపోయిందని, జంతువు కొన్ని అడుగులు కూడా కదలలేని పరిస్థితి ఏర్పడిందన్నారు. స్థానిక పశు వైద్యులు ఇచ్చిన చికిత్సకు స్పందన లేకపోవడంతో 15 రోజుల పాటు ఈ పరిస్థితితో బాధపడిందని, జంతువును వెటర్నరీ క్లినికల్ కాంప్లెక్స్, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, తిరుపతికి రెఫర్ చేశారు. ఆవుకి తొడ ప్రాంతంలో గ్యాస్ట్రోక్నిమియస్ కండరాల యొక్క మస్క్యులోటెండినస్ భాగం పూర్తిగా చీలిపోయిందని నిర్ధారించబడిందన్నారు. ఇది జంతువు యొక్క హాక్ జాయింట్ భూమిని తాకడం వల్ల హాక్ జాయింట్ పొడిగింపును నిరోధించింది. డాక్టర్ ఎం. రఘునాథ్ నేతత్వంలోని సర్జన్ల బందం, సర్జరీ ప్రొఫెసర్ డాక్టర్. ఎస్. భారతి, డాక్టర్ జి. వాణి, పోస్ట్ గ్రాడ్యుయేట్ విద్యార్థులతో సహా ఈ అరుదైన పరిస్థితి ఉన్న ఆవుకి శస్త్రచికిత్స చేశారు. తరువాత మూడవ రోజున ఆవును డిశ్చార్జ్ చేశారు. ఆవుకు నూతనోత్తేజం అందించిన సర్జన్ల బందాన్ని కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ కె.ఆదిలక్ష్మమ్మ అభినందించారు.



5 కిలోల బంగారం పట్టివేత

ప్రజాశక్తి-సూళ్లూరుపేట

సూళ్లూరు పేట, నాయుడు పేట పోలీసులు జాయింట్ ఆపరేషన్‌లో భాగంగా వాహనాల తనిఖీల్లో బుధవారం ఐదు కిలోల బంగారం పట్టుబడింది. చెన్నై నుంచి నెల్లూరుకు కారులో అక్రమంగా తరలిస్తున్న బంగారు బిస్కట్స్‌ను పోలీసులు పట్టుకున్నారు. పట్టు బడ్డ బంగారంను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పట్టుకున్న బంగారు బిస్కెట్స్ ను దొరవారిసత్రం పోలీసు స్టేషన్ కు తరలించారు.

'అమర'లో అత్యాధునిక వైద్యం

శిశు సంరక్షణ ఐసియు ప్రారంభం

ప్రజాశక్తి -రేణిగుంట

అమర ఆస్పత్రిలో అత్యాధునిక వైద్యం అందుబాటులో ఉందని, బుధవారం శిశు సంరక్షణ ఐసియు యూనిట్‌ను ప్రారంభించామని హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ గౌరినేని రమాదేవి స్పష్టం చేశారు. బుధవారం రేణిగుంట మండలంలోని కరకంబాడి నందు గల అమర హాస్పిటల్ లో శిశు సంరక్షణ ఐసీయూను రేణిగుంట సబ్ డివిజనల్ పోలీస్ ఆఫీసర్ భవ్య కిషోర్ ముఖ్య అతిథులుగా పాల్గొని రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. హాస్పిటల్లోని అత్యాధునిక పరికరాలతో ఏర్పాటుచేసిన నియోనటల్ (శిశు సంరక్షణ ఐసియూ)ను పరిశీలించి వైద్య పరికరాల గురించి డాక్టర్ కిషోర్ వివరించారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా ప్రతినిధుల సమావేశంలో అమర హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ రమాదేవి మాట్లాడుతూ అమర హాస్పిటల్ నందు అన్ని వైద్య విభాగాలు అత్యాధునిక సౌకర్యాలు కలిగి



ఎంతోమంది ఆరోగ్యం తిరిగి పొందటం ఆనందంగా ఉందన్నారు. అత్యాధునిక సౌకర్యాలతో శిశు సంరక్షణ ఐసీయూను ఏర్పాటు చేశామన్నారు. సమాజంలో మాతా శిశు మరణాలు చాలా చూస్తున్నామని అలాంటి సంఘటనలు తగ్గించడానికి అమర హాస్పిటల్ నందు ప్రారంభిస్తున్నామని పేర్కొన్నారు. నెలలు నిండకుండా పుట్టిన శిశువులకు బరువు తక్కువగా పుట్టిన, అంగవైకల్యంతో పుట్టిన వారికి మొదలగు అత్యవసర చికిత్స కావలసిన చిన్న పిల్లలందరికీ అత్యాధునిక సౌకర్యాలతో ఎంతో అనుభవం కలిగిన డాక్టర్ల బందం అందుబాటులో ఉన్నారని తెలిపారు. తల్లి శిశు సంరక్షణ ఎంతో మెరుగుగా ఇవ్వగలమని అన్నారు. ముఖ్యఅతిథి డి.ఎస్.పి భవ్య కిషోర్ మాట్లాడుతూ రేణిగుంట దగ్గరలోని అమరా హాస్పిటల్ నందు అత్యాధునిక సౌకర్యాలతో శిశు సంరక్షణ ఐసీయూని ప్రారంభించడం చాలా సంతోషంగా ఉందన్నారు. అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అమర హాస్పిటల్ శిశు సంరక్షణ వైద్య నిపుణులు డాక్టర్ కిషోర్ మాట్లాడుతూ తల్లి ప్రసవించిన అనంతరం జరిగే వన్ అవర్ ప్రాసెస్ ను గోల్డెన్ అవర్ అంటామన్నారు. శిశువు జననం తర్వాత వెంటనే శ్వాసించలేని బిడ్డకు ఊపిరి అందించడం వివిధ సపరి చర్యలు శిశువుకు అంద చేస్తారని పేర్కొన్నారు. ఈ సమయం ఎంతో విలువైనదని శిశు సంరక్షణ వైద్య నిపుణులు డాక్టర్ కిషోర్ అన్నారు. అమర హాస్పిటల్ సిఏఓ వేణుగోపాల్, హాస్పిటల్ బందం నరసింహారావు, అమర రాజా గ్రూప్స్ పి ఆర్ ఓ బాబ్జి చౌదరి పాల్గొన్నారు.

దుప్పి దొరికినా...పట్టించుకోని ఎఫ్ఆర్‌ఒ

ప్రజాశక్తి - యర్రావారిపాలెం

అడవులను, అటవీ జంతువులను కాపాడాల్సిన అటవీ అధికారులే వేటగాళ్లతో జతకలిసి పోవడం విమర్శలకు తావిస్తోంది. తాజాగా దుప్పిని వండుకుని తిన్నా భాకరాపేట ఎఫ్ఆర్ఒ నామమాత్రంగా తనిఖీలు చేసి వేటగాళ్లతో కుమ్మక్కయ్యారని సమాచారం. స్థానికుల వివరాల మేరకు... మండలంలోని విఆర్ అగ్రహారం పంచాయతీలోని పంట పొలాల సమీపంలో అటవీ ప్రాంతం నుంచి దారి తప్పి వచ్చిన అడవి దుప్పి నీటి కొలనులో చిక్కుకుంది. గమనించిన సాయిబులపల్లి, అగ్రహారానికి చెందిన కొంతమంది ఉచ్చు వేసి పట్టుకుని మంగళవారం రాత్రి మాంసాన్ని వండుకుని తిని 'పండగ' చేసుకున్నారు. స్థానికులు కొంతమంది మీడియాకు, భాకరాపేట ఎఫ్ఆర్ఒకు సమాచారం అందించారు. అయితే నామమాత్రంగా వచ్చి తనిఖీలు చేసి రాజీకి పోయారని ఫిర్యాదు చేసిన వారి ఆవేదన. అడవిపందులు, దుప్పులు, నెమళ్లు తదితర అటవీ జంతువులు ఆహారంగా మారిపోతున్నా అటవీ శాఖ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు మండిపడుతున్నారు. దుప్పిని చంపిన



ఈ దుప్పి ఏమయ్యింది..?

బాధితులపై తగిన చర్యలు తీసుకోని పక్షంలో కలెక్టర్ దృష్టికి తీసుకెళతామని 'మీడియా'కు తెలిపారు.



ప్రజాశక్తి-తిరుపతి టౌన్

అంగరంగ వైభవంగా తిరుపతి గంగమ్మ జాతర ప్రారంభమయ్యింది. గంగమ్మ నామ స్మరణతో తిరుపతి హోరెత్తింది. మంగళ వాయిద్యాల నడుమ కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి బుధవారం ఉదయం గంగమ్మతల్లికి సారె సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. పద్మావతిపురం ఎంఎల్ఎ నివాసం నుంచి గంగమ్మ ఆలయం వరకూ జనసందోహంగా మారింది. వీధులన్నీ వేపాకు తోరణాలతో పాటు మామిడి, అరటి తోరణాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. దారి పొడవునా మహిళలు పసుపు నీళ్లు కుమ్మరిస్తూ, టెంకాయలు కొడుతూ కర్పూర హారతులిస్తూ స్వాగతించారు. గంధం బొట్లు పెట్టుకుని, వేపాకు చేతబూని, వివిధ వేషధారణలతో విచ్చేసి భక్తిశ్రద్ధలతో అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి విచ్చేసిన కళాకారులు దారి పొడవునా జానపద శైలిలో సాగే అమ్మవారి భక్తి కీర్తనలతో, డప్పు వాయిద్యాల నడుమ లయబద్ధంగా చిందేస్తూ ఆకట్టుకున్నారు. నవదుర్గలు, కాంతారా, తప్పెటగుళ్లు, డప్పులు, తీన్‌మార్, కీలుగుర్రాలు, కొమ్ముకొయ్య, దింపా, పగటి వేషగాళ్లు, పులివేషాలు, గరగల్లు, బోనాల కళా ప్రదర్శన ఆద్యంతం ఆకట్టుకుంది. ఎంఎల్ఏ నివాసం వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో టిటిడి ఈవో ఎవి ధర్మారెడ్డి, కలెక్టర్‌కె.వెంకటరమణారెడ్డి, ఎస్‌పి పరమేశ్వరరెడ్డి, నగర మేయర్ డాక్టర్ శిరీష, కమిషనర్ హరిత పాల్గొన్నారు.

తరలి వచ్చిన బైరాగులు

తాతయ్యగుంట గంగమ్మజాతరలో భాగంగా బుధవారం గంగమ్మగుడికి భైరాగివేషాలు వేసి అమ్మవారిని దర్శించుకున్నారు. ఎక్కువమంది చిన్నారులు బైరాగివేషాలు వేసుకురావడం చూపారులకు ఆకట్టుకుంది. భక్తులు తమ శరీరానికి తెల్లటి రంగు పేస్ట్ (నాము కొమ్ము) పూసుకుని, "రెల్ల కాయ" పండ్లతో చేసిన మాల ధరించారు. వేపాకు నడుముకు కట్టుకుని, చేతుల్లో పట్టుకుని కనిపించారు. దర్శనం తర్వాత ఆలయం వద్ద ఆ వేప ఆకులు, రెల్ల కాయ దండను అక్కడే వదిలివేస్తారు. ఆలయ వద్ద భైరాగి వేషాదారులతో సందడి కనిపించింది.

గంగమ్మజాతర వైభవంగా నిర్వహిస్తాం : ఎంఎల్ఎ

తిరుపతి శ్రీ తాతయ్య గంగమ్మ జాతర ఉత్సవం మంగళవారం చాటింపుతో ప్రారంభమైందని స్థానిక ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం ఉదయం తిరుపతి శ్రీ తాతయ్య గుంట గంగమ్మ తల్లికి సారె సమర్పించిన అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఎప్పుడైతే శ్రీ వేంకటేశ్వర స్వామి కొండమీద కొలువయ్యారో అప్పుడే గంగమ్మ తల్లిని తన చెల్లిలిగా తీసుకొచ్చారని అవధూత గణపతి సచ్చిదానంద స్వామి ఉటంకించడం జరిగిందన్నారు. చారిత్రక ఆధారాలను బట్టి ఇది పల్లవుల కాలం నాటి దేవాలయమని, శ్రీ వెంకటేశ్వర స్వామికి పరమ భక్తుడైన అనంతాళ్వార్ అమత హస్తాలతో తిరిగి పున్నప్రతిష్ఠించిన దేవాలయమన్నారు. మళ్లీ 900 సంవత్సరాల తర్వాత ఈ తరంలో ముఖ్యమంత్రి వై ఎస్ జగన్ మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు ఆలయ పునర్నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. కొద్ది కాలంలోనే ఆలయ పనులు పూర్తి చేయడం జరిగిందన్నారు. మహా కుంభాభిషేకానికి కంచి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ విజయేంద్ర సరస్వతి స్వామివారు విచ్చేసి అనుగ్రహ భాషణ చేశారన్నారు. వెనువెంటనే విశాఖ శారదా పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ స్వరూపానందేంద్ర స్వామి వారు ప్రథమ దర్శనం చేసుకున్నారు. ఓ కార్యకర్తగా తమ కుటుంబం తరపున బుధవారం అమ్మ వారికి సారె సమర్పించానన్నారు. జాతర అంగరంగవైభవంగా జరుగుతుందని తెలిపారు.



భూములకు పట్టాలు ఇప్పించండి



ప్రజాశక్తి-పెళ్లకూరు: మండలంలోని కానూరు రాజుపాలెం గ్రామ పంచాయతీ ఎగువ కానూరు గిరిజన కాలనీలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇప్పించాలని సిఐటియు జిల్లా సహాయ కార్యదర్శి ముకుంద ఆధ్వర్యంలో గిరిజనులు ఎమ్మార్వోకి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా గిరిజనులు మాట్లాడుతూ గత 20 సంవత్సరాలుగా సర్వే నెంబర్ 91 లో 40 కుటుంబాల వారం సుమారు 80 ఎకరాలు సాగు చేసుకుంటున్నామని, గతంలో జిల్లా కలెక్టర్, జిల్లా రెవిన్యూ అధికారి, పెళ్లకూరు రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేసినప్పటికీ, వీరు జాప్యం చేయడంతో మాకు తప్ప మిగిలిన సాగు చేసుకున్న వారందరికీ పట్టాలు ఇచ్చి ఉన్నారు. ప్రస్తుతం మేము సాగుచేసుకుంటున్న భూముల్లో ఫారెస్ట్ అధికారులు కొంత ఇబ్బంది కల్గిస్తున్నారన్నారు. దీంతో జీవనోపాధి లేక వలసలు పోయి జీవిస్తున్నామని, వలసలు పోవడంతో తమ పిల్లలను స్కూలుకు పంపి చదివించుకోలేని దీనస్థితిలో మేమున్నామన్నారు. కనుక సదరు విషయమై పరిశీలన జరిపి మాకు పట్టాలిప్పించి మా జీవనోపాధికి మార్గం చూపించవలసిందిగా కోరుచున్నామంటూ ఎమ్మార్వోకి వినతిపత్రం అందజేశారు.

మామిడికాయల మండీ ప్రారంభం

ప్రజాశక్తి-చంద్రగిరి: హేమా ట్రేడర్స్ ప్రొప్రైటర్ పులిపాటి హేమాద్రి ఆధ్వర్యంలో బుధవారం చంద్రగిరి బైపాస్‌లో కాటా వద్ద మామిడికాయల మండీని ప్రారంభించారు. చంద్రగిరిలో గత పది సంవత్సరాలుగా మామిడికాయల మండీ ఏర్పాటు చేసి, చంద్రగిరి, పాకాల, రామచంద్రాపురం, చిన్నగొట్టిగల్లు, తిరుపతి రూరల్, వెదురుకుప్పం మండలాల రైతుల నుంచి మామిడికాయలు కొనుగోలు చేస్తూ, రైతులకు మామిడికాయలు లోడు దింపగానే అప్పటికప్పుడు రైతుకు ఆరోజు ధర ప్రకారం నగదు చెల్లించి సహకారాన్ని అందిస్తున్నట్లు పులిపాటి హేమాద్రి తెలిపారు.

పేదలకు అందని ఆరోగ్య శ్రీ సేవలు



ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: వైసీపీ పాలనలో ప్రచార ఆర్భాటం, హడావిడి తప్ప పేద ప్రజలకు ఒరిగేది ఏమీ లేదని, పేదలకు అందాల్సిన ఆరోగ్యశ్రీ సేవలు అందడం లేదని, ఈ ప్రభుత్వంలో సరైన వైద్య సేవలు అందక ఇబ్బంది పడుతున్నారని నగరి నియోజకవర్గ తెలుగు దేశం పార్టీ ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ పేర్కొన్నారు. బుధవారం పుత్తూరు మున్సిపాలిటీ చెర్లోపల్లిలో భానుప్రకాష్ పర్యటించారు. అనారోగ్యంతో బాధపడుతున్న దుర్గయ్యను పరామర్శించారు. తనకు ఇప్పటివరకు ఆరోగ్యశ్రీ కార్డు అందలేదని, వైద్యానికి ప్రైవేటు ఆసుపత్రికి వెళ్తే ఆరోగ్యశ్రీ కార్డు లేదని, ఉచిత వైద్యం అందించలేమని తెలిపారని భాను ప్రకాష్‌కు వివరించారు. గత ప్రభుత్వంలో ఎన్టీఆర్ ఆరోగ్యశ్రీ ద్వారా పేదలకు మెరుగైన వైద్యం అందించామని, ప్రైవేటు ఆసుపత్రులకు చెల్లించాల్సిన బకాయిలు సకాలంలో చెల్లించడంతో పేదలకు ఇబ్బంది లేకుండా వైద్యం అందేదని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పట్టణ ప్రెసిడెంట్ జీవరత్నం నాయుడు, చిత్తూరు పార్లమెంటరీ వైస్ ప్రెసిడెంట్ గంజి మాధవయ్య, నియోజకవర్గ ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ ఆనంగి ఆనంద్, 21 వ వార్డు ప్రెసిడెంట్ ఆనంగి రమేష్, పట్టణ అధికార ప్రతినిధి జి.బాబు పాల్గొన్నారు.

పండు ఈగతో మామిడిలో తీవ్ర నష్టం

ప్రజాశక్తి-చిన్నగొట్టిగల్లు: ప్రస్తుతం వర్షాలు కురుస్తుండటంతో మామిడి సాగులో పండు ఈగ తీవ్రంగా నష్టపరుస్తుందని ఉద్యానశాఖాధికారి శివకుమారి అన్నారు. బుధవారం పండు ఈగ నివా



రణ జాగ్రత్తలపై రైతులకు ఉద్యానశాఖాధికారి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శివకుమారి మాట్లాడుతూ పండు ఈగతో మామిడి పంట దెబ్బతిని రైతులు నష్టపోయే పరిస్థితి ఏర్పడు తుందన్నారు. పండు ఈగలు కాయపక్వానికి రాకముందే పచ్చి కాయలపై గుడ్లు పెడతాయని తెలిపారు. గుడ్ల నుంచి పిల్ల పురుగులు బయటకు వచ్చి కాయలోని గుజ్జును తినటం ఫలితంగా పండు కందిపోయినట్లు అవుతుందన్నారు. ఇలా పండు ఈగ ఎక్కువగా ఆశిస్తే కాయలు రాలిపోతాయని చెప్పారు. పండు ఈగ సోకడంతో సుమారు 15 నుంచి 20 శాతం మేర పండ్లకు మార్కెట్లో ధర తగ్గుతుందన్నారు. పండు ఈగ ఆశించిన పండ్లను వాటిపై ఉన్న రంధ్రాలను బట్టి గుర్తించవచ్చునానరు. నివారణకు పండు ఈగ ఆశించిన పండ్లను వెంటనే గుర్తించి కాల్చి వేయాలని, ఐఐహెచ్ఆర్ పండు ఈగ నివారణ బుట్టలను ఎకరాకు 8 చొప్పున భూమికి 5 నుంచి 6 అడుగుల ఎత్తులో కట్టాలని తెలిపారు. కట్టేటప్పుడు మలాథియాన్ 2-4 చుక్కలు మిథైల్ యూజినాల్ చేర్చిన ప్లైవుడ్ ముక్క పై వేసి డబ్బాలో వేయాలి. 15 రోజుల తర్వాత ప్లైవుడ్ ముక్కను మార్చాలి. కార్యక్రమంలో సిబ్బంది పూర్ణిమ, రైతులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి డీఎస్పీగా భీమారావు బుధవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో కాకినాడ సబ్ డివిజన్ డీఎస్పీగా పనిచేస్తున్న భీమారావు పగిలిలో భాగంగా శ్రీకాళహస్తికి వచ్చారు. పుణ్యక్షేత్రం శ్రీకాళహస్తిలో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా గట్టి చర్యలు చేపడతామని ఆయన చెప్పారు.

అంబేద్కర్ స్టార్ కృష్ణకు ఘన సన్మానం



ప్రజాశక్తి-రేణిగుంట: అంబేద్కర్ బహుజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబేద్కర్ స్టార్ కృష్ణకు ప్రముఖ వ్యాపారవేత్త రవితేజ ఆధ్వర్యంలో ఘన సన్మానం చేశారు. బుధవారం మండలంలోని జి పాలెం గ్రామ పంచాయతీ స్టార్ కృష్ణ నగర్‌లోని అంబేద్కర్ స్టార్ కృష్ణ నివాసంలో ఆయన్ను రవితేజ, జర్నలిస్టులు పూలమాల వేసి శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ముక్కోటి దేవుళ్ళ ఆశీస్సులతో, ఆయురారోగ్య అష్టైశ్వర్యాలతో ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు.

మట్టి మాఫియా నుంచి శ్మశానాన్ని కాపాడండి



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: మట్టి మాఫియా కబంద హస్తాల్లోంచి మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్న శ్మశాన వాటికను కాపాడాలని రాజీవ్ నగర్ కాలనీ వాసులు బుధవారం స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. వీరి నిరసనకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు అంగేరి పుల్లయ్య మాట్లాడుతూ శ్రీకాళహస్తిలో అవినీతి మాఫియా పెట్రేగిపో తోందన్నారు. చెరువులు, గుంతలు, కాలువలు, చివరకు శ్మశానాలను సైతం మాఫియా వీరులు వదలడం లేదని వాపోయారు. ఈ క్రమంలోనే పట్టణ శివారు ప్రాంతమైన రాజీవ్ నగర్ కాలనీ వాసులకు (హిందూ, ముస్లిం, క్రిస్టియన్) 2010లో ప్రస్తుత జగనన్న కాలనీ వెనుక భాగం లో కంచర్ల గుంట వద్ద కేటాయించిన ఐదెకరాల శ్మశాన స్థలంలో మట్టి మాఫియా అక్రమ తవ్వకాలు చేస్తోందని చెప్పారు. ఈ క్రమంలో పూడ్చి పెట్టిన శవాలను సైతం పక్కకు తోసి రాత్రికి రాత్రే జేసీబీలు, ట్రాక్టర్ల సాయంతో మట్టి, ఎర్రగుళ్ల తరలించి సొమ్ము చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఫలితంగా హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల మనోభావాలు దెబ్బతింటున్నాయని వాపోయారు. ప్రస్తుతం అక్కడ మట్టిని మాత్రమే తరలిస్తు న్నారనీ, చూస్తూ ఊరు కుంటే కబ్జా చేసినా ఆశ్చర్య పోనక్కర్లేదన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి శ్మశాన స్థలాన్ని కాపాడటం తో పాటు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ల శ్మశాన వాటికలకు హద్దులు ఏర్పరచాలని కోరారు. అనంతరం సూపరింటెండెంట్‌కు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రాజీవ్ నగర్ కాలనీవాసులు కరీముల్లా ఖాన్, రహీం, దస్తగిరి, సర్దార్, రహీం బాషా, బాలాజీ నాయుడు, బత్తెయ్య, గురునాథం, ప్రసాద్, సీఐటీయూ నాయకుడు గంధం మణి పాల్గొన్నారు.

'ప్రమాదాలను ప్రథమ చర్యలతో నివారించవచ్చు'



ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): మానవ తప్పిదాలు, చిన్నచిన్న పొరపాట్లపై జాగ్రత్తలు వహిస్తే జరిగే ప్రమాదాలను ప్రథమ చర్యలతోనే నివారించవచ్చని విజయవాడకు చెందిన నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్ పదవ బెటాలియన్ అండర్ కమాండర్ ఇన్‌స్పెక్టర్ దీపక్ కుమార్ అన్నారు. బుధవారం మంగళం పరిధిలోని తిరుమల నగర్ గ్రామపంచాయతీ సచివాలయ ప్రాంగణంలో స్థానిక ప్రజలకు ముందస్తు ప్రమాద నివారణ చర్యలపై సామాజిక అవగాహన సదస్సును నిర్వహించారు. ఎన్‌డిఆర్ఎఫ్ కేంద్ర కార్యాలయ ఆదేశానుసారం తిరుపతి జిల్లా కలెక్టర్ చొరవతో గ్రామీణ ప్రాంతాలలో మానవ తప్పిదాలతో ప్రమాదాలు, భూకంపం, ఆకస్మిక గుండె నొప్పి వచ్చినప్పుడు సిపిఆర్‌తో ప్రాణాలను ఎలా కాపాడవచ్చు, ఏదేని ప్రమాదాలు జరిగితే రక్త గాయాలైనప్పుడు రక్త స్రావం జరగకుండా ఎటువంటి చర్యలు చేపట్టాలి, వేసవి సెలవుల దష్ట్యా పిల్లల పట్ల తల్లిదండ్రులు ఏ విధమైన అప్రమత్తత కలిగి ఉండాలనే అంశాలపై 19 మంది సభ్యులతో కూడిన ఎన్‌డిఆర్ఎఫ్ బృందం స్థానిక ప్రజలకు, సచివాలయ సిబ్బందికి, ప్రజా ప్రతినిధులకు అవగాహన కల్పించారు. రాష్ట్ర బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ గుండ్రాజు లక్ష్మీదేవి, మండల విద్యాశాఖ అధికారి ప్రభాకరరాజు, వైసిపి పంచాయతీ ఇన్‌ఛార్జ్ గుండ్రాజు శివశంకర్ రాజు, వీఆర్‌ఓలు భూపతి ఆచారి, శంకరయ్య, సచివాలయ కార్యదర్శి జయశంకర్, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

'నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలతో ఎమ్మెల్యే అయ్యారు'




ప్రజాశక్తి-నాగలాపురం: మాజీ ఎమ్మెల్యే హేమలత నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలతో 2009లో ఎమ్మెల్యే అయ్యారని నియోజకవర్గ ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం ఆరోపించారు. బుధవారం స్థానిక మార్కెటింగ్ కమిటీ కార్యాలయంలో మీడియా సమావేశం ఏర్పాటు చేసి టిడిపి మాజీ ఎమ్మెల్యే హేమలత, ఆమె కుమార్తె టిడిపి ఇన్‌ఛార్జ్ హెలెన్‌పై పలు ఆరోపణలు గుర్తించారు. బీసీ కులానికి చెందిన హేమలత నకిలీ కుల ధ్రువీకరణ పత్రాలు సష్టించుకుని గతంలో సత్యవేడు ఎంపీపీ, ఎమ్మెల్యేగా పదవులను అక్రమంగా అనుభవించారని ఆయన ఆరోపించారు. అయితే హేమలత ఎస్సీ సామాజిక వర్గం కాదని, బీసీ కులానికి చెందినట్లు చదువుకున్న రికార్డుల ప్రకారం తేలింది అన్నారు. హేమలత చదువుకున్న రాజమండ్రి ప్రభుత్వ కళాశాల ప్రిన్సిపల్ సమాచార హక్కు చట్ట ప్రకారం ద్వారా ఇచ్చిన కుల ధ్రువీకరణ సమాచారంలో ఆది ఆంధ్ర క్రిస్టియన్‌గా ఉందన్నారు. దీనిపై రెవెన్యూ అధికారులు విచారించి ఇటువంటివి మళ్లీ పునరావృతం కాకుండా చర్యలు తీసుకుని, దళిత కులాలకు న్యాయం చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం స్థానిక ఎస్సీ నాయకులతో కలిసి ఎమ్మార్వో ప్రసన్న కుమార్ కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాగలాపురం మండలంలోని సురుటుపల్లి పంచాయతీలో గతంలో ఎమ్మెల్యే గా ఉన్న హేమలత పేదలకు పంచి పెట్టాల్సిన భూములను అక్రమంగా తన బంధువుల పేర్లతో పట్టాలు చేసుకున్నారని దళిత నాయకుల ఆరోపించారు. వెంటనే అధికారులు పరిశీలించి దళిత కులానికి న్యాయం చేయాలని వారు కోరారు.

షుగర్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తుల వేలం వాయిదా



ప్రజాశక్తి-బియన్ కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలంలోని సుధలగుంట షుగర్ ఫ్యాక్టరీ ప్రైవేట్ లిమిటెడ్ ఆస్తుల వేలంలో బుధవారం ఒక్కరు కూడా హాజరుకాకపోవడంతో ఈ వేలాన్ని జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు వాయిదా వేశారు. భూములను స్వాధీన పరుచుకుని, చెరుకు సరఫరా చేసిన రైతులకు పాత బకాయిలను చెల్లించడానికి ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చిందని స్థానిక తహశీల్దార్ హనుమాన్ నాయక్ తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రెవెన్యూ యాక్ట్ 1864 సెక్షన్ 28 ప్రకారం షుగర్ ఫ్యాక్టరీ యాజమాన్యానికి ఫారం-7 నోటీస్‌లు జారీ చేశామని, సదరు భూములను వేలం వేసి రైతు బకాయిలను, ప్రభుత్వానికి కట్టవలసిన పన్నులను చెల్లించుటకు సబ్ రిజిస్ట్రార్ తొట్టంబేడు నుంచి సదరు భూములకు గల మార్కెట్ విలువలను సేకరించడమైనదని తహశీల్దార్ తెలిపారు. డిప్యూటీ తహశీల్దార్ శివయ్య, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ వెంకటసుబ్బయ్య పాల్గొన్నారు.

అక్రమ లేఔట్‌లో సూచిక బోర్డులు మాయం



ప్రజాశక్తి-పెళ్లకూరు: మండలంలోని తాల్వాయిపాడు గ్రామంలో సర్వే నెంబర్ 80, 81 వాటి సబ్ డివిజన్లో 8 ఎకరాల 83 సెంట్లు భూమియందు వేసిన అక్రమ లేఔట్, టాపే ట్రాక్టర్ షోరూం బ్యాక్ సైడ్ స్వర్ణముఖిలోకి సర్వం సిద్ధమై అమ్ముడు జరుగుతున్న సర్వే నెంబర్ 68 లో1ఎ,1బి మరో 2 ఎకరాల అక్రమ లేఔట్‌కు సంబంధించి గ్రామ ప్రజలు తిరుపతి జిల్లా కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో వినతి పత్రం ఇచ్చారు. దీంతో డిఎల్‌పిఒ వెంకటరమణ ఆదేశాల మేరకు పంచాయతీ కార్యదర్శి తిరుమల రావు, గ్రామ సర్పంచి కల్పన, ఇఒపిఆర్‌డి, సర్వేయర్ బుధవారం ఉదయం ఈ రెండు లే అవుట్లలో ఇవి అక్రమ లేఅవుట్లంటూ సూచిక బోర్డులు పెట్టారు. పెట్టిన అరగంటలకే బోర్డులు మాయమయ్యాయని గ్రామ ప్రజలు చెప్పుకొస్తున్నారు. జిల్లా అధికారుల చొరవతోనే ఈ సమస్య పరిష్కారం అవుతుందని గ్రామ ప్రజలు ఎదురుచూస్తున్నారని కొందరు గ్రామస్తులు తెలియజేశారు.

లెగస్సి వేస్ట్ మేనేజ్మెంట్ బయో రిమిడియేషన్ ప్రాసెస్ ప్రారంభం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణ సమీపంలో ఏర్పాటైన డంపింగ్ యార్డ్ వద్ద లెగస్సి వేస్ట్ మేనేజ్మెంట్ బయో రిమిడియేషన్ ప్రాసెస్ ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ పోణకా దేవసేనమ్మ, ఎమ్మెల్యే వరప్రసాద్ రావు టెంకాయలు కొట్టి పనులు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్ పర్సన్ మాట్లాడుతూ పురపాలక సంఘం ఏర్పడినప్పటి నుంచి డంపింగ్ యార్డ్ తొలగించలేదన్నారు. తన హయాంలో ఈ కార్యక్రమం చేపట్టినందుకు సంతోషంగా ఉందన్నారు. చెత్తను తొలగించిన తర్వాత ఈ స్థలంలో పురపాలక సంఘానికి ఆదాయం వచ్చే పనులు చేపడతామన్నారు. వర్షాకాలం వచ్చేలోపు పనులు పూర్తి కావాలని కమిషనర్‌కు సూచించామన్నారు. ప్రజలు కూడా ఇంటి వద్దనే తడి, పొడి చెత్తను వేరుచేసి సిబ్బందికి ఇవ్వాలని కోరారు. చెత్తను వేరు చేయడంతో ఆదాయం సమ కూరుతుందని, పరిశుభ్రత పాటించాలని వివరించారు. అనంతరం ఎమ్మెల్యే వరప్రసాద రావు మాట్లాడుతూ పురపాలక సంఘం ఛైర్‌పర్సన్‌గా దేవసేనమ్మ ఉన్నప్పటి నుంచి డంపింగ్ యార్డ్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపించారన్నారు. వైకాపా నేత శివకుమార్ రెడ్డి సహకారంతో సొంత నిధులు వెచ్చించి ఇక్కడ పనులు చేపట్టారని గుర్తు చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ తోట సాయి నాథ్, కోదండ రామయ్య, గోపాల్ యాదవ్, అజీజ్ ఖాన్, ముని, సాయి, ఇమ్రాన్, అల్తాఫ్, కొట్టు గోవర్ధన్, అన్నం మురళి, పారిశుద్ధ్య కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గంగ జాతర

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు రూరల్ మండలంలోని గోపాల కష్ణాపురం పంచాయతీ పైడిపల్లి గ్రామంలో వైభవంగా గంగ జాతర వేడుకలను నిర్వహించుకున్నారు. పైడిపల్లి గ్రామ ప్రజలు నడి వీధిలో గంగమ్మను ఏర్పాటు చేసుకొని భక్తులు గంగమ్మకు అంబిల్లు, అభిషేకం చేసి పొంగళ్ళు పెట్టుకొని మొక్కులు తీర్చుకున్నారు. ఈ ఉత్సవాలకు ముఖ్యఅతిథిగా నగిరి నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జ్ గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. కార్యక్రమంలో చిత్తూరు పార్లమెంటరీ ఉపాధ్యక్షులు గంజి మాధవయ్య, పాండురంగయ్య, పట్టణాధ్యక్షులు రవికుమార్, గాలి జీవరత్నం నాయుడు, పుత్తూరు అధికార ప్రతినిధి జి బాబు, టిడిపి నాయకులు కార్యకర్తలు, పైడిపల్లి గ్రామ ప్రజలు పాల్గొన్నారు.



నూతన మార్కెట్ కమిటీ సమావేశం



ప్రజాశక్తి-బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని మార్కెట్ యార్డులో బుధవారం ఉదయం నూతన మార్కెట్ కమిటీ ఛైర్మన్‌గా ఉగ్గుమూడి సంధ్య ఆధ్వర్యంలో మొదటి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి మూడు మండలాల మార్కెటింగ్ డైరెక్టర్లు, కమిటీ మెంబర్లు మార్కెటింగ్ కమిటీ సిబ్బంది పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఛైర్మన్ సంధ్య మాట్లాడుతూ గతంలో ఉన్న మార్కెటింగ్ కమిటీ ఛైర్మన్ బందిలి కిలియమ్మ మరణానంతరం నాకు ఈ అవకాశాన్ని ఇచ్చినందుకు కమిటీ డైరెక్టర్లకు, సభ్యులకు కతజ్ఞతలు తెలియజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మార్కెటింగ్ కమిటీకి కొన్ని ప్రతిపాదనలు ప్రకటించారు. ఆ ప్రతిపాదనల్లో బుచ్చినాయుడు కండ్రిగ మండలం ప్రధాన కార్యాలయం, మార్కెట్ యార్డ్ నందు వివిధ రకాల అభివద్ధి పనులను చేపట్టవలసిందన్నారు. సమావేశానికి 3 మండలాల డైరెక్టర్లు, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వజ్రమ్మను విధుల్లోకి తీసుకోవాలి



ప్రజాశక్తి-ఓజిలి: మధ్యాహ్న భోజన కార్మికురాలు వజ్రమ్మను విధుల్లోకి తీసుకోవాలని బుధవారం సిఐటియు ఆధ్వర్యంలో కరపత్రాలు విడుదల చేశారు. ఈ సందర్భంగా సిఐటియు నాయకులు చాపల వెంకటేశ్వర్లు, మధ్యాహ్న భోజనం కార్మికుల జిల్లా కార్యదర్శి కె.విజయమ్మ, ఐద్వా నాయకురాలు చంద్రకళలు మాట్లాడుతూ మధ్యాహ్న భోజన కార్మికురాలు మైలారి వజ్రమ్మ గత 16 రోజులుగా తనను విధుల్లోకి తీసుకోవాలని నిరసన చేస్తున్నా అధికారుల్లో చలనం లేదని వాపోయారు. 23 సంవత్సరాలుగా విధులు నిర్వహిస్తున్న వజ్రమ్మను స్థానిక రాజకీయాల కారణాలతో, కక్ష సాధింపులతో వజ్రమ్మను అకారణంగా తొలగించి పైశాచిక ఆనందం పొందుతున్నారని పేర్కొన్నారు. ఈ సమస్యపై స్పందన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా స్థానిక అధికారులు ఫిర్యాదుపై చొరవ చూపకుండా రాజకీయ నాయకులకు అడుగులకు మడుగులు ఒత్తుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మధ్యాహ్న భోజన కార్మికులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులకు అండగా సర్పంచ్



ప్రజాశక్తి-తిరుచానూరు: స్థానిక గ్రామపంచాయతీలోని సుమారు 500 మంది ఆటో కార్మికులకు అండగా ఉంటామంటూ స్థానిక సర్పంచ్ కె రామచంద్రారెడ్డి ముందుకు వచ్చాడు. బుధవారం ఎఐటియుసి ఆధ్వర్యంలోని శ్రీ పద్మావతి షేర్ ఆటో వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం ధర్మరాజుల గుడి వద్ద, యోగిమల్లవరం మునీశ్వరుని ఆలయం వద్ద యోగిమల్లవరం నాటు వర్కర్స్ యూనియన్ జనరల్ బాడీ సమావేశం జరిగింది . ఈ సమావేశాలకు తిరుచానూరు సర్పంచ్ రామచంద్రారెడ్డి, నియోజకవర్గ కార్యదర్శి చంద్రశేఖర్ రెడ్డి, వార్డు సభ్యులు మునేంద్ర, బ్రాహ్మణపల్లి ఎంపీటీసీ యోగానంద రెడ్డి లు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కార్మికులకు ఏ చిన్నపాటి కష్టం కలిగిన అండగా ఉంటాం అంటూ వారికి రెండు జతల యూనిఫామ్ పంపిణీ చేయడం చేశారు. కార్యక్రమంలో ఆటో యూనియన్ నాయకులు ప్రకాష్, సాయి, చంద్రబాబు, సుధాకర్, దాము, మునిరాజా, మునస్వామి, శ్రీనివాసులు, ఆటో కార్మికులు పాల్గొన్నారు.

మాతమ్మ ఉత్సవాలు ప్రారంభం

ప్రజాశక్తి-సత్యవేడు: మండలంలోని అలిమేలు మంగాపురం గ్రామంలో బుధవారం మాతమ్మ ఉత్సవాలు అట్టహాసంగా గ్రామ సర్పంచ్ శిరీష, శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో ప్రారంభమయ్యాయి. ఐదు రోజుల పాటు మాతమ్మ ఉత్సవాలు నిర్వహిస్తున్నట్టు ఉత్సవ కమిటీ పేర్కొంది. మాతమ్మ ఉత్సవాల్లో భాగంగా తొలి రోజు మాతమ్మ అమ్మవారికి ఉదయం ఆది అరుంధత వాడ కాలనీకి చెందిన పలువురు మాతమ్మ మహిళా భక్తులు అంబల్లు పోశారు. మహిళలు భక్తిశ్రద్ధలతో ఉదయాన్నే అంబళ్లతో నిండిన పాత్రకు వేప సరం చుట్టి డప్పు వాయిదాల మధ్య మాతమ్మ ఆలయానికి చేరుకున్నారు. అక్కడ అమ్మవారికి అంబలి పోసి మాతమ్మకు విశేష పూజలు చేశారు. ఈ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి.

ఇళ్ల స్థలాలు పరిశీలన



ప్రజాశక్తి-దొరవారిసత్రం: మండల పరిధిలోని మినమలమూడి గ్రామంలో బుధవారం స్థానిక తహశీల్దార్ గోపీనాథ్ రెడ్డి ఇల్లు లేని గిరిజనుల వారికి ఇంటి నిర్మాణానికి ఇళ్ల స్థలాలు పరిశీలించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ మినమలమూడి గిరిజన కాలనీకి చెందిన కొందరికి ఇల్లు, ఇంటి స్థలము లేదని ఇటీవల అర్జీ రూపంలో తెలుపగా ఈ క్రమంలో వీఆర్వో వెంకటరత్నం, వైసిపి మండల కన్వీనర్ ఈశ్వర్ వాక శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో గిరిజన కాలనీ పక్కనే ఖాళీగా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిశీలించామన్నారు. అర్హులను గుర్తించి వారికి ఇంటి స్థలాన్ని కేటాయించి పట్టాలు ఇవ్వడం జరుగుతుందని గోపిరెడ్డి తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్వీయూ పాలకమండలిలో పలు నిర్ణయాలు ఆమోదం: రిజిస్ట్రార్

ప్రజాశక్తి-క్యాంపస్: శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ పాలకమండలి సమావేశం బుధవారం ఎస్వీయూలో జరిగింది. ఎస్వీయూ ఉపకులపతి ఆచార్య కె రాజారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉన్నత విద్యా మండలి, ఉన్నత విద్యాశాఖ అధికారులు ఆన్‌లైన్‌లో హాజరవ్వగా, విసి కార్యాలయంలో కొందరు సభ్యులు ప్రత్యక్షంగా పాల్గొన్నారు. ఈ సమావేశంలో పలు అంశాలపై చర్చలు జరిపారు. కొన్ని నిర్ణయాలు తీసుకున్నారు. అకడమిక్ కన్సల్టెంట్లకు ప్రభుత్వం విడుదల చేసిన జిఒ నంబర్ 110 కు సంబంధించి సానుకూలంగా చర్చ జరిగింది. ప్రస్తుతం పనిచేస్తున్న అకడమిక్ కన్సల్టెంట్ల విద్యార్హత, సర్వీసు వివరాలను పరిపూర్ణంగా పరిశీలించడంతోపాటు, ఎంత ఆర్థిక సర్దుబాటు అవసరమో వివరాలను తదుపరి పాలకమండలి సమావేశంలో సమర్పించాలని నిర్ణయించారు. ప్రభుత్వం నుండి 62 ఏళ్ల అనుమతి జిఒ విషయమై చర్చ జరిగింది. ఉన్నత విద్యా శాఖ డిప్యూటీ సెక్రటరీ వెంకటేశ్వర రావు, ఆచార్య హనుమంతరావు, భాస్కర్ రెడ్డి, మధు ఆఫ్‌లైన్‌లో పాల్గొనగా ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య హేమచంద్రా రెడ్డి, ఆచార్య అపర్ణ తదితర సభ్యులు ఆన్‌లైన్‌లో పాల్గొన్నారు.

దోపిడీ కేసులో ఇద్దరు అరెస్టు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: దోపిడీ కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ మల్లిఖార్జున తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం శ్రీకాళహస్తి పట్టణ రెండవ పట్టణ పోలీస్ స్టేషన్‌లో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 7వ తేదీ ఆదివారం రాత్రి కేవీబీపురం మండలానికి చెందిన చంద్రశేఖర్ అనే వ్యక్తి తన స్వగ్రామానికి వెళ్లడానికి శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు సమీపంలో వేచి ఉండగా, శ్రీకాళహస్తి పట్టణం పెద్దమసీదు వీధికి చెందిన మహమ్మద్ రఫీ, ఇమాంవీధికి చెందిన ఇస్మాయిల్ అనే ఇద్దరు ఆయనపై దాడి చేసి రూ.7 వేలు దోచుకున్నారన్నారు. చంద్రశేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి విచారణ చేశామన్నారు. ఈ విచారణలో పెద్దమసీదువీధికి చెందిన మహమ్మద్ రఫీ, ఇమాంవీధికి చెందిన ఇస్మాయిల్ ఈ దోపిడీకి పాల్పడినట్లు తేలిందన్నారు. ఈ ఇద్దరినీ బుధవారం అరెస్టు చేశామన్నారు. మహమ్మద్ రఫీ, ఇస్మాయిల్ గతంలో కూడా పలు పర్యాయాలు దోపిడీ, చోరీలకు పాల్పడినట్లు తమ విచారణలో తేలిందని సీఐ మల్లిఖార్జున తెలిపారు. ఈ దోపిడీ కేసు ఛేదించడంలో రెండవ పట్టణ పోలీస్ స్టేషన్ కానిస్టేబుళ్లు శ్రీనివాసులు, మహేష్ కీలక పాత్ర పోషించారన్నారు. ఈ ఇద్దరికీ రివార్డులు ఇస్తున్నట్లు సీఐ మల్లిఖార్జున తెలిపారు. ఈ కార్యక్రమంలో రెండవ పట్టణ ఎస్ఐ మహేష్ బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

అక్రమార్కులెవ్వర్నీ వదలం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: రాజీవ్ నగర్‌లో అక్రమాలకు పాల్పడిన వారెంతటి వారైనా వదలి పెట్టమని శ్రీకాళహస్తి రెండవ పట్టణ సీఐ మల్లిఖార్జున చెప్పారు. శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీసు స్టేషన్‌లో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. రాజీవ్ నగర్‌లో ప్రభుత్వ స్థలాలను అక్రమంగా విక్రయిస్తున్న పురపాలక ఉద్యోగి అల్లూరయ్యపై శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి తహసీల్దారు రూప్ చంద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు చీటింగ్ కేసు నమోదు చేసి మంగళవారం అరెస్టు చేసినట్లు ఆయన చెప్పారు. ఆయనను రిమాండు నిమిత్తం కోర్టుకు హాజరు పరుస్తున్నట్లు తెలిపారు. అల్లూరయ్య నుంచి రాజీవ్ నగర్ కు చెందిన 1621 ఇంటి పట్టాలను స్వాధీనం చేసుకున్నట్లు ఆయన తెలిపారు. రాజీవ్ నగర్ లో అల్లూరయ్య సుమారు 70 ఇంటి స్థలాలు విక్రయించినట్లు తమ విచారణలో తేలిందని సీఐ మల్లిఖార్జున చెప్పారు. రాజీవ్ నగర్ అక్రమాల్లో పదుల సంఖ్యలో వివిధ వర్గాలకు చెందిన నిందితులు ఉన్నారన్నారు. వీరందరినీ త్వరలో అరెస్టు చేసి జైలుకు పంపుతామన్నారు. ప్రాథమిక సమాచారం మేరకు రాజీవ్ నగర్‌లో 3వేల ఇంటి స్థలాలు అనర్హుల ఆధీనంలో ఉన్నట్లు తేలిందన్నారు. 2వ పట్టణ ఎస్ఐ మహేష్ బాబు పాల్గొన్నారు.

కర్నాటక వాసి ఆత్మహత్య



ప్రజాశక్తి-తిరుపతి సిటి: ఉరివేసుకుని ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన బుధవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు... తిరుపతి పెద్దకాపులేఅవుట్‌లోని ఓ ప్రయివేట్ లాడ్జిలో కర్ణాటక రాష్ట్రం కోలార్ జిల్లా ములబాగల్‌కు చెందిన ఎస్.వినోద్‌కుమార్ (30) రెండు రోజుల క్రితం అద్దెకు దిగాడు. మంగళవారం రాత్రి రూమ్‌కు చేరుకున్న ఆయన బుధవారం ఉదయం గది నుండి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చిన లాడ్జి సిబ్బంది పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని, గది తలుపులు పగలకొట్టి చూడగా వినోద్‌కుమార్ ఫ్యాన్‌కు ఉరివేసుకుని మృతి చెంది ఉన్నాడు. మృతుడు కర్నాటక వాసిగా గుర్తించి, పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని రుయాకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైతు బజార్‌ను త్వరలో ప్రారంభిస్తాం



ప్రజాశక్తి-గూడూరు టౌన్: పట్టణంలోని పాత బస్టాండ్ సెంటర్ సమీపంలో నూతనంగా నిర్మించిన రైతు బజార్‌ను ఎమ్మెల్యే వరప్రసాదరావు, స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ దేవసేనమ్మ, పురపాలక కమిషనర్ సాయినాథ్, వ్యవసాయ మార్కెటింగ్ శాఖ అధికారులు బుధవారం పరిశీలించారు. షాపుల కేటాయింపు, మౌలిక వసతులపై ఎమ్మెల్యే అధికారులతో చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికలకు ముందు అనేక హామీలు ఇచ్చామని, వాటిలో చాలావరకు పూర్తి చేశామని పేర్కొన్నారు. రైతు బజార్ మరో 15 రోజుల్లో ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తామన్నారు. కూరగాయల మార్కెట్ పనులు కూడా వేగవంతంగా జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అతి త్వరలో ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు కూడా ప్రారంభిస్తామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ ఛైర్మన్ యమునమ్మ, వైస్ ఛైర్మన్ కొట్టు గోవర్ధన్, వైసీపీ సీనియర్ నాయకులు ఎల్లసిరి గోపాల్ రెడ్డి, మురళి, గోపాల్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

అంతా ప్రచారార్భాటాలే



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో అభివద్ధి శూన్యమనీ, ఈ నాలుగేళ్లు ప్రచారార్భాటాలతోనే స్థానిక ఎమ్మెల్యే సరిపెట్టేశారని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కోటా వినుత విమర్శించారు. బుధవారం ఆమె నేనూ-నా నియోజకవర్గ ప్రజలు కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని ప్రాజెక్టు వీధిలో పర్యటించారు. ఈ సందర్భంగా గడప గడపకూ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. ఎక్కడికెళ్లినా అభివద్ధి శూన్యమనీ, అయితే స్థానిక ఎమ్మెల్యే గొప్పలు చెప్పుకుంటున్నాడని విమర్శించారు. కనీసం వీధుల్లో సరిగా మురుగు కాలువలు, వీధి దీపాలు, రోడ్లు కూడా లేవని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రమోద్, నితీష్ పాల్గొన్నారు.